# సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



**ఆద్యంతం ఉత్కంఠ**
పాల్వంచ పెద్దమ్మతల్లిఆలయ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆద్యంతం ఉత్కంఠ నడుమ కొనసాగింది. 10లో



**ఎన్నాళ్లకు మోక్షం..**
దశాబ్దకాలంగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న సెర్ప్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. 10లో

**వాతావరణం**
గరిష్టం / కనిష్టం
41° / 26°
జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. వడ గాలులు, ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

## న్యూస్‌రీల్

### గురుకులాల్లో ఉత్తీర్ణత అంతంతే..

భద్రాచలం: గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్‌లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ప్రథమ సంవత్సరంలో గతేడాది కంటే కొంతమేర ఉత్తీర్ణత పెరగగా, ద్వితీయ సంవత్సరంలో తగ్గింది. ప్రథమ సంవత్సరంలో 808 మంది బాలికలకు 621 మంది (76.87 శాతం)ఉత్తీర్ణులయ్యారు. గతేడాది ఉత్తీర్ణత 74.60 శాతంగా ఉంది. బాలురు 511 మందికి 327 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 63.99 శాతం కాగా, గతేడాది 63.46 శాతం ఉంది. ఖమ్మం రీజియన్‌లో భద్రాచలం స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నుంచి ఎంపీసీలో దివ్య 463, దమ్మపేట నుంచి జయ 462, ఖమ్మం నుంచి జశ్వంత్ 462 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. బైపీసీలో చరణ్ 427, యశ్వంత్ 427, తరుణ్ 427, పి.దివ్య 426 మార్కులు సాధించారు.

**ద్వితీయంలో తగ్గుముఖం..**
ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బాలికలు 757 మందికి 645 మంది(85.20 శాతం) ఉత్తీర్ణత సాధించగా గతేడాది 84.45 శాతం నమోదైంది. బాలురు 480 మందికి 370 మంది (77.08 శాతం) ఉత్తీర్ణులు కాగా, గతేడాది 81. 26 శాతంగా నమోదైంది. మొత్తంగా 1,237 మంది పరీక్షలు రాయగా 1,015 మంది (82.05 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఖమ్మం రీజియన్ టాపర్లుగా ఎంపీసీలో సంతోష్ 986, ప్రవీణ 984, ఉదయ్ 984, బైపీసీలో లేఖన 984, శివ 974, సీఈసీలో శ్రీనిధి 979 మార్కులు సాధించగా వీరందరినీ ఐటీడీఏ పీఓ రాహుల్, గురుకులాల సమన్వయ అధికారి నాగార్జునరావు అభినందించారు.

### ఆటో డ్రైవర్ కుమార్తెకు ఉత్తమ ర్యాంక్


సమన్విత

ఇల్లెందు: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ యామనగండ్ల బాబూరావు - ఉమ కుమార్తె సమన్విత ఇంటర్ ఎంపీసీలో 993 మార్కులతో ఉత్తమ ర్యాంక్ సాధించింది. 1 నుంచి 10 వరకు ప్రభుత్వ, సింగరేణి పాఠశాలలో చదివిన సమన్విత ఇంటర్ సాహితీ జూనియర్ కళాశాలలో చదివింది. తన తండ్రికి భారీగా ఫీజు చెల్లించే స్తోమత లేదని, కష్టపడి చదివి ఇంజనీరింగ్‌లో మంచి కాలేజీలో సీటు సాధించాలనే లక్ష్యంతో ఉన్నానని చెప్పింది.

### పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్ తనిఖీలు

ఖమ్మంవ్యవసాయం: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా చేపట్టిన పత్తి కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయనే సమాచారంతో విజిలెన్స్ విభాగం అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్ల జారీలో కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడ్డారనే అంశంపై విచారణ జరగగా, కొన్నాళ్ల క్రితం భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ సస్పెన్షన్‌కు గురయ్యారు. వ్యవసాయ శాఖ పంట నమోదు ఆధారంగా సీసీఐ పత్తి కొనుగోళ్లు నిర్వహించాలని నిర్ణయించినా, ప్రక్రియ పూర్తికాకపోవడంతో వ్యవసాయ శాఖ ఉద్యోగులకు తాత్కాలిక రిజిస్ట్రేషన్(టీఆర్)కు అవకాశం కల్పించారు. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు క్వింటాకు రూ.5వేల నుంచి రూ.6 వేల చొప్పున పత్తి కొనుగోలు చేసి, ఉద్యోగుల సహకారంతో టీఆర్ తీసుకుని రూ.7,521 చొప్పున సీసీఐ కేంద్రాల్లో అమ్మారు. ఈ విషయమై విచారణలో భాగంగా మంగళవారం జిల్లా మార్కెటింగ్ శాఖలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. అయితే, టీఆర్ పుస్తకాల వివరాలు సమర్పించేందుకు అధికారులకు రెండు రోజుల సమయం ఇచ్చినట్లు తెలిసింది.

# బాలికలదే పైచేయి..

**ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 62.56 శాతం ఉత్తీర్ణత**
- ద్వితీయ సంవత్సరంలో 71.27 శాతం..
- ప్రతిభ చాటిన ప్రైవేటు కళాశాలలు, కేజీబీవీలు
- రాష్ట్రంలో జిల్లాకు 9వ స్థానం



కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ ఫలితాలు మంగళవారం విడుదల కాగా, బాలికలే పైచేయి సాధించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అమ్మాయిలే అత్యధికంగా ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం జనరల్‌లో 3,028 మంది బాలురకు 1,570 మంది, 4,187 మంది బాలికలకు 2,944 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో 860 మంది బాలురకు 402 మంది, 1,179 మంది బాలికలకు 863 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం జనరల్‌లో2,996 మంది బాలురకు 1,855 మంది, 4,083 మంది బాలికలకు 3,190 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో బాలురు 763 మందికి 495 మంది, బాలికలు 1,024 మందికి 882 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా ప్రథమ సంవత్సరంలో 62.56 శాతం, ద్వితీయ సంవత్సరంలో 71.27 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది ప్రథమ సంవత్సరంలో 54.83, ద్వితీయ సంవత్సరంలో 70.72 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈ ఏడాది కొంత మేర పెరిగి రాష్ట్ర స్థాయిలో జిల్లా 9వ స్థానంలో నిలిచింది. ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు బుధవారం నుంచి 30వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంది. మే 22 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..**
కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 421 మందికి 181 మంది, ద్వితీయ సంవత్సరంలో 376 మందికి 238 మంది ఉత్తీర్ణత సాధించారు. జనరల్ విభాగంలో బి. శ్వేతశ్రీ 1000కి 936 మార్కులు సాధించింది. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో మేఘన 470కి 423 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కత్తి రమేష్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

### కలెక్టర్‌ను కలిసిన డీఐఈఓ


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న డీఐఈఓ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల వివరాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు డీఐఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు నిరాశ చెందొద్దని, ఇలాంటి ఫెయిల్యూర్స్ జీవితంలో ఎన్నో గుణపాఠాలు నేర్పుతాయని, తద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సూచించారు. త్వరలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

# ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యం

**ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విశృత్**


విశృత్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కొత్తగూడెంలోని గాజుల రాజం బస్తీకి చెందిన లిక్కి విశృత్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. 1000కి 994 మార్కులు సాధించాడు. విశృత్ స్థానిక నలంద కాలేజీలో ఇంటర్(ఎంపీసీ) చదివాడు. తండ్రి కోటేశ్వరరావు పాల్వంచ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా, తల్లి నివేదన నగరంలోని ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పని చేసున్నారు. చిన్నప్పటి నుంచే ప్రణాళికాయుతంగా చదివించడంతో ఉత్తమ ఫలితాలు సాధించాడని విశృత్ తల్లిదండ్రులు తెలిపారు.

**ఎస్పీ రోహిత్‌రాజు స్ఫూర్తితో..**
ఉత్తమ ఫలితాలు సాధించిన అనంతరం విశృత్ మాట్లాడుతూ.. జేఈఈలో మంచి ర్యాంకు సాధించి ఐఐటీలో చేరడం తన లక్ష్యమని, ఆ తర్వాత సివిల్స్ రాసి ఐఏఎస్ కావాలన్నది తన జీవిత కల అని తెలిపాడు. ప్రస్తుతం జిల్లా ఎస్పీగా పని చేస్తున్న రోహిత్‌రాజు తనకు ఆదర్శమని చెప్పాడు. తండ్రి ఏఎస్‌ఐగా పని చేస్తున్నప్పుడు రోహిత్‌రాజు ఐపీఎస్‌కు సెలక్ట్ అయ్యారని తెలుసుకుని తాను ఎంతో స్ఫూర్తి పొందానని, ఆయన తరహాలోనే తన తండ్రి పోలీస్‌గా పని చేస్తున్నప్పుడే తాను ఐఏఎస్ అధికారిని కావాలని లక్ష్యంగా పెట్టుకున్నానని చెప్పాడు. కాగా, ఎస్పీ రోహిత్‌రాజు విశృత్‌ను మంగళవారం అభినందించారు.

# భూ భారతితో సమస్యలకు చెక్

- జూన్ 2 నుంచి అందుబాటులోకి పోర్టల్
- కలెక్టర్ జితేష్ వి. పాటిల్ వెల్లడి


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎమ్మెల్యే ఆదినారాయణ, అధికారులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : ప్రభుత్వం తాజాగా రూపొందించిన భూ భారతి చట్టం రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని, ఈ చట్టంతో భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. అన్నపురెడ్డిపల్లిలో భూ భారతి చట్టంపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. జూన్ 2 నుంచి పోర్టల్ అందుబాటులోకి వస్తుందన్నారు. గతంలో ఉన్న ధరణికి ఇది విరుద్ధమని, రైతుల భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని చెప్పారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ భూ భారతి చట్టం రైతులకు వరం లాంటిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధు, ఏడీఏ రవికుమార్, తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఏఓ అనూష, వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వరరావు, వేముల రమణ పాల్గొన్నారు.

**ఆర్‌వైవీ అర్హుల జాబితా రూపొందించాలి**
సూపర్‌బజార్(కొత్తగూడెం): రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితా రూపొందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని, మండల ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో ఎంపీడీఓలు, బ్యాంకు మేనేజర్లు, కమిటీ సభ్యులు కార్యాచరణ రూపొందించుకుని క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. జనాభా ప్రాతిపదికన యూనిట్ల కేటాయింపు ఉంటుందని, ఒకే గ్రామంలో ఒక యూనిట్‌కు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించాలని అన్నారు. ఆయా కార్పొరేషన్ల అధికారులు సైతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో పాల్గొనాలని ఆదేశించారు. వ్యవసాయ సంబంధిత యూనిట్ల స్థాపనపై అవగాహన కల్పించాలని, చేపల పెంపకం యూనిట్ల ద్వారా ఆర్థిక పురోగతి ఉంటుందని తెలిపారు. సమావేశంలో సీపీఓ సంజీవరావు, బీసీ సంక్షేమాధికారి ఇందిర, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి చట్టంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, హౌసింగ్ పీడీ శంకర్ తదితరులు హాజరయ్యారు.

# కార్పొరేషన్‌గా కొత్తగూడెం

- గెజిట్ విడుదల, త్వరలో జీఓ
- రెండు మున్సిపాలిటీలు, ఏడు పంచాయతీలతో ఏర్పాటు


కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్ : కొత్తగూడెం కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు త్వరలోనే జీఓ కూడా వచ్చే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు అంటున్నారు. జీఓ విడుదల అయ్యాక డివిజన్ల ఏర్పాటు ప్రక్రియ జరుగనుంది. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలు కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం కొత్తగూడెం మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా లక్షకు పైగా జనాభా, 65 వేల మంది ఓటర్లు ఉన్నారు. పాల్వంచ మున్సిపాలిటీలో 24 వార్డులు, లక్ష జనాభా, 70 వేల మంది ఓటర్లు ఉన్నారు. సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీల్లో కలిపి 14 వేల మంది జనాభా, 10 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. మొత్తంగా కొత్తగూడెం కార్పొరేషన్‌లో 60 డివిజన్లు ఏర్పాటు చేయాలని గెజిట్‌లో పేర్కొన్నారు. కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయితే భూములు, ఆస్తుల విలువతో పాటు ఇళ్లు, పంపుల పన్నులు కూడా అదే స్థాయిలో పెరిగే అవకాశం ఉంది. కాగా, పాల్వంచ మున్సిపాలిటీకి సంబంధించి కోర్టు కేసులు ఉండడంతో రెండు దశాబ్దాలుగా ఎన్నికలు జరుగలేదు. ఇక కార్పొరేషన్ ఆమోదంతో ఎన్నికలు జరుగుతాయని పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ పెంపు..!**
కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీల్లో పని చేసే ఉద్యోగులకు మంచి రోజులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రజలు చెల్లించే పన్నులు పెరిగినట్టుగానే ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏ కూడా పెరగనుంది. జీఓ విడుదల తర్వాత కొత్తగూడెం కార్పొరేషన్‌గా పేరు మార్చడం, డివిజన్ల ఏర్పాటుతో పాటు కమిషనర్‌ను నియమించాల్సి ఉంది.

# నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

## క్లుప్తంగా

### జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో కానిస్టేబుల్ ప్రతిభ



పతకం అందుకుంటున్న ప్రసాద్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రసాద్ జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించాడు. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఈ నెల 20 నుంచి 26 వరకు జరుగుతున్న 7వ జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సోమవారం జరిగిన జావెలిన్ త్రో పోటీలో ప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సొంతం చేసుకున్నాడు. ప్రసాద్‌ను పోలీస్ ఉన్నతాధికారులతో పాటు పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు అభినందించారు.

### ఖమ్మం రీజియన్‌లో అగ్రస్థానం



సఫియా



సతీశ్‌కుమార్

గుండాల: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల కేంద్రంలోని గురుకుల కళాశాల ఖమ్మం రీజియన్‌లో అగ్రస్థానంలో నిలిచింది. బైపీసీ సెకండియర్‌లో సఫియా 917 మార్కులు సాధించింది. కస్తూర్బా కళాశాలలో ఫస్టియర్‌లో 21 మందికి అందరూ, సెకండియర్‌లో 10 మందికి 10 మంది ఉత్తీర్ణులయ్యారు. గుండాల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ 96 మందికి 72 మంది, సెకండియర్‌లో 76కు 75 మంది ఉత్తీర్ణత సాధించారు. యూఆర్‌జేసీలో ద్వితీయ సంవత్సరం 30 మందికి 30 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ ఎంపీసీలో బి.సతీశ్‌కుమార్ 985, బైపీసీలో జె.భరత్‌కుమార్ 863, సీఈసీలో కె.హేమంత్ 797 మార్కులు సాధించారు.

### కేసు నమోదు

ఇల్లెందు: మండలంలోని హనుమంతులపాడు గ్రామానికి చెందిన కీసరి మౌనికను ఆమె భర్త నెహ్రూ, అత్త గురువమ్మ, బావ శ్రీను కొంత కాలంగా వేధిస్తున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న నెహ్రూ మద్యానికి బానిసగా మారి భార్య మౌనికను ఇబ్బంది పెడుతున్నాడు. తాళలేక మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ మసీనా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### వృద్ధుడి ఆత్మహత్య

కరకగూడెం: మద్యానికి బానిసై ఓ వృద్ధుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన తాళ్ల మురళి (63) మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మద్యం మత్తులో పురుగులమందు తాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

### మొక్కజొన్న కంకులు దగ్ధం

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం శివారులో బంధంకుంట చెరువు సమీపంలోని మొక్కజొన్న చేనులో కుప్పగా పోసిన కంకులు మంగళవారం దగ్ధమయ్యాయి. రైతులు గుడిపెల్లి సుధాకర్, మంచె రామనాథం, మంచె రవీందర్, మంచె శ్రీనుకు చెందిన ఐదెకరాల విస్తీర్ణంలోని మొక్కజొన్న పంటకు సంబంధించిన కంకులను కోసి, చేనులోనే కుప్పగా పేర్చారు. మధ్యాహ్నం సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. నేల తడిగా ఉండటంతో కుప్పలు పూర్తిగా కాలిపోకుండా కాపాడుకోగలిగారు. అయినప్పటికీ తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

### విద్యుదాఘాతంతో సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి

చర్ల : ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో విద్యుత్ షాక్‌తో ఓ జవాను మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లా గంగులూరు సీఆర్‌పీఎఫ్ 195వ బెటాలియన్ క్యాంప్‌లో జవాన్‌గా పని చేస్తున్న సుజోయ్‌పాల్ (34) సోమవారం సాయంత్రం ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డుకు మరమ్మతు చేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. దీంతో సహచర జవాన్లు గంగులూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతదేహాన్ని బీజాపూర్‌కు తరలించి శవ పంచనామా అనంతరం అతడి స్వస్థలమైన పశ్చిమ బెంగాల్‌కు మంగళవారం తరలించినట్లు ఏఎస్పీ చంద్రకాంత్ గవర్ణ తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

టేకులపల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని మద్రాస్‌తండాకు చెందిన బాణోతు వినోద్ ఎలాంటి అనుమతులు లేకుండా శంభునిగూడెం ముర్రేడు వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో నింపుకుని ఇల్లెందుకు తరలిస్తుండగా ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# మా ఊళ్లో ఏం జరుగుతోంది..?

**'మేరీ పంచాయతీ' యాప్‌లో సమస్త సమాచారం**
- నిధుల ఖర్చులో పారదర్శకతకు ప్రాధాన్యత
- ఆదాయ, వ్యయాలను గ్రామస్తులు తెలుసుకునే అవకాశం
- తద్వారా అక్రమాలకు అడ్డుకట్ట




మేరీ పంచాయతీ యాప్

భద్రాచలంఅర్బన్: గ్రామ పంచాయతీలో అభివృద్ధి వివరాలను ప్రజలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'మేరీ పంచాయతీ (నా పంచాయతీ) యాప్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌తో పంచాయతీల్లో ఆదాయ, వ్యయాల విషయంలో పారదర్శకత పాటించే అవకాశం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులను పాలకవర్గం ఎలా ఖర్చు చేస్తోందనే విషయాన్ని ప్రజలు నేరుగా తెలుసుకోవచ్చు. ఈయాప్‌ను 2019లోనే రూపొందించినా పలు కారణాలు, సాంకేతిక సమస్యలతో ప్రజలకు కొన్ని వివరాలను అందించలేపోయింది. అయితే ప్రస్తుతం ఈ యాప్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది.

**పారదర్శక పాలన..**

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటారు. ఆ నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపర్చాలని, తద్వారా గ్రామాల్లో పారదర్శక పాలన సాగుతుందని అధికారులు చెబుతున్నారు. నిధుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండడంతో గ్రామాభివృద్ధికి ఎలాంటి పనులను చేపడుతున్నారో ప్రజలు తెలుసుకోవచ్చు. ఇందులో వివరాల నమోదు సమయంలోనే జీపీఆర్‌ఎస్ ద్వారా గుర్తించే అవకాశం ఉండడంతో, అక్కడి పనులకు కేటాయించిన డబ్బును ఇతర చోట్ల వినియోగించేందుకు వీలుండదు. పాలకవర్గాలు సైతం పొరపాట్లు చేయడానికి అవకాశం ఉండదు. పాలకులు, అధికారులు తప్పుడు నివేదికలు రూపొందిస్తే ప్రజలకు ప్రశ్నించేందుకు వీలు కలుగుతుంది.

**అన్ని వివరాలు నిక్షిప్తం..**

గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధుల వివరాలు మాత్రమే కాకుండా సర్పంచ్, కార్యదర్శి, గ్రామ కమిటీలు, ఆస్తులకు సంబంధించిన వివరాలన్నీ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ సంవత్సరం పంచాయతీలకు మంజూరు చేసే నిధుల వివరాలు, ఏ పనికి ఎంత ఖర్చు చేశారు, అవి ఏ దశలో ఉన్నాయి అనే వివరాలు యాప్‌లో నమోదై ఉంటాయి. ఆదాయ, వ్యయాలతో పాటు పంచాయతీలో నిర్వహించే గ్రామ సభల వివరాలు సైతం యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

**ప్లేస్టోర్ ద్వారా...**

స్మార్ట్ ఫోన్‌లో ఉండే ప్లేస్టోర్ యాప్‌లో 'మేరీ పంచాయతీ' పేరుతో సెర్చ్ చేయగానే వచ్చే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాక లాగిన్ అవ్వాలి. ఆ వెంటనే ఫైనాన్షియల్ ఇయర్, స్టేట్, జిల్లా, మండలం, పంచాయతీ వివరాలు కనిపిస్తాయి. వాటిని నమోదు చేయగానే ఆయా పంచాయతీలకు సంబంధించిన అంశాలు కనిపిస్తాయి.

**కొరవడిన అవగాహన**

'మేరీ పంచాయతీ' యాప్‌నకు సంబంధించి గ్రామ పంచాయతీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంలో వెనకబడి ఉన్నారనే చెప్పాలి. చాలావరకు గ్రామాల్లో కొంత చదువుకున్న యువతకు తప్ప, ఇతరులకు ఈ యాప్ ఉన్నట్టు కూడా తెలియదు. యాప్‌పై అవగాహన లేకపోవడంతో చాలామంది తమ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి వివరాలు తెలుసుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు యాప్ పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

**ప్రజలకు అవగాహన కల్పించాలి**



పంచాయతీ పద్దులకు సంబంధించి ఇలాంటి యాప్ ఉన్న విషయం చాలామందికి తెలియదు. ప్రజలకు యాప్‌పై అవగాహన లేకపోవడంతో నిధుల వినియోగానికి సంబంధించి అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రజలే నేరుగా నిధుల వివరాలను తెలుసుకునేలా అధికారులు ఈ యాప్‌పై అందరికీ అవగాహన కల్పించాలి.

– వీవీఎస్ ప్రసాద్, భద్రాచలం

# సివిల్స్‌లో మెరిసిన రత్నాలు

- మత్కేపల్లి వాసి చరణ్ తేజకు 231 ర్యాంక్
- 697వ ర్యాంకు సాధించిన గిరిజన యువకుడు నాగరాజు



తల్లిదండ్రులతో చరణ్ తేజ

చింతకాని: యూపీఎస్సీ మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో ఖమ్మం జిల్లా నుంచి ఇద్దరు యువకులు ర్యాంకులు సాధించారు. చింతకాని మండలం మత్కేపల్లికి చెందిన నర్శింశెట్టి చరణ్ తేజ 231 ర్యాంక్‌ను సాధించడం విశేషం. గ్రామానికి చెందిన నర్శింశెట్టి హరినాథ్‌బాబు – నాగమణి దంపతుల చిన్న కుమారుడు చరణ్ తేజ 10వ తరగతి వరకు హైదరాబాద్‌లోని నారాయణ కాన్సెప్ట్ స్కూల్‌లో, ఇంటర్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో పూర్తిచేశాక జేఈఈలో 88వ ర్యాంకు సాధించి ముంబై ఐఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఆతర్వాత తొమ్మిది నెలల పాటు రూ.32 లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసినా సివిల్ సాధించాలనే లక్ష్యంతో ఉద్యోగం మానేశాడు.

**సొంతంగానే సిద్ధం..**

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేశాక చరణ్‌తేజ ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న వనరుల ద్వారా సివిల్స్‌కు సిద్ధమయ్యాడు. 2022లో తొలిసారి పరీక్ష రాసినా ప్రిలిమ్స్‌కు అర్హత సాధించకపోగా 2023లో ఇంటర్వ్యూ దశకు చేరాడు. ఇక మూడో ప్రయత్నంలో ఈసారి ఆలిండియా 231వ ర్యాంక్ సాధించడం విశేషం. ఆయన తల్లిదండ్రులు 25ఏళ్ల క్రితమే హైదరాబాద్‌లో స్థిరపడగా తండ్రి హరినాథ్‌బాబు ప్రైవేట్ కంపెనీలో మెకానికల్ ఇంజనీర్‌గా, తల్లి నాగమణి మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. చరణ్ సోదరుడు జైశిక్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా చరణ్‌తేజతో 'సాక్షి' మాట్లాడగా సివిల్స్‌లో ఆప్షనల్‌గా గణితం ఎంచుకున్నట్లు వెల్లడించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సివిల్స్ సాధించానని, ఐఎఫ్ఎస్ ఎంచుకోవాలనే భావనతో ఉన్నట్లు తెలిపాడు.

### వ్యవసాయ కుటుంబం నుంచి 697వ ర్యాంకు



నాగరాజు నాయక్

కల్లూరురూరల్: కల్లూరు మండలం వాచ్యా నాయక్ తండాకు చెందిన గిరిజన యువకుడు బానోత్ నాగరాజు నాయక్ సివిల్స్ ఫలితాల్లో మెరిశాడు. ఆయన ఆల్‌ఇండియా స్థాయిలో 697వ ర్యాంక్ సాధించాడు. నాగరాజు నాయక్ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కల్లూరులో, 6నుంచి 10వ తరగతి వరకు పాలేరులోని నవోదయ విద్యాలయంలో చదవగా, ఇంటర్ విజయవాడ శ్రీ చైతన్య కళాశాల, బీటెక్ హైదరాబాద్‌లోని వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో పూర్తిచేశారు. సివిల్స్‌లో సోషయాలజీ సబ్జెక్ట్ ఆప్షనల్‌గా తీసుకున్న నాగరాజు ఐదో ప్రయత్నంలో విజయం సాధించాడు. నాగరాజు తండ్రి పంతులు నాయక్ – తల్లి మారోని వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తూ ఇద్దరు కుమారులను చదివించారు. ప్రస్తుతం నాగరాజు సివిల్స్ సాధించగా.. ఆయన సోదరుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం సివిల్స్ ప్రిలిమ్స్ దశ దాటిన వారికి ఇచ్చే రూ.లక్ష పారితోషికం అందుకున్న గిరిజన తండా వాసి నాగరాజు సివిల్స్‌కు ఎంపికవడంపై పలువురు అభినందించారు.

# ఎన్నాళ్లకు మోక్షం..

- సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్
- పదేళ్లుగా ఉద్యోగుల నిరీక్షణ
- ఉమ్మడి జిల్లాలో 335 మంది ఉద్యోగులు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



మహిళా సంఘాల సమావేశంలో సెర్ప్ సిబ్బంది (ఫైల్)

చుంచుపల్లి: దశాబ్దకాలంగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 335 మందికి బదిలీ అయ్యే అవకాశం ఏర్పడింది. బదిలీల ప్రక్రియ పూర్తయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని కేడర్లలో కొత్తవారు రానున్నారు. గతేడాది జూలైలో జరిపిన సాధారణ బదిలీల్లో తమకు అవకాశం కల్పించాలని సెర్ప్ ఉద్యోగులు కోరినా కానీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వర్తింపజేయటం లేదంటూ కొన్నేళ్లుగా వాపోతున్నారు. పదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం వీరి బదిలీల విషయం ఊసెత్తకపోవడంతో కొందరు ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. సెర్ప్ పరిధిలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఏళ్లుగా ఒకే కేడర్‌లో పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2023 నుంచి సెర్ప్ సిబ్బందికి పే–స్కేల్ విధానం ద్వారా వేతనాలు చెల్లిస్తోంది. వీరిలో ఎంఎస్ సీసీ నుంచి డీపీఎం స్థాయివరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. సెర్ప్ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల విషయంలో యూనియన్ నాయకులు సంబంధిత శాఖ మంత్రులతో గతంలోనూ అనేక దఫాలుగా చర్చలు జరిపారు. ఎట్టకేలకు ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు ముందుకురావడంతో వారి పదేళ్ల నిరీక్షణకు త్వరలో తెర పడనుంది.

**335 మందికి అవకాశం**

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు, వారికి ఉపాధి కల్పనలో ఆర్థిక తోడ్పాటును అందిస్తున్న సెర్ప్ ఉద్యోగులు దాదాపు 23 ఏళ్లుగా అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు. సెర్ప్ పరిధిలో మినిస్టీరియల్, ఫీల్డ్ సిబ్బంది, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మేనేజర్లు, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు వివిధ హోదాలో ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా అన్ని కేడర్లకు సంబంధించి 335 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 156 మంది, ఖమ్మం జిల్లా పరిధిలో 179 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని సెర్ప్ ఉద్యోగులకు ప్రతి నెలా రూ.1.30 కోట్ల మేర వేతనాల రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000లో 'వెలుగు' పేరుతో మహిళా స్వయం సహాయక సంఘాల కోసం సంస్థను పరిమిత జిల్లాల్లో ప్రారంభించారు. 2002లో ఆ ప్రాజెక్టును క్రమంగా రాష్ట్రం అంతటా విస్తరింపజేశారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకం పేరును పూర్తిగా ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ)గా మార్చగా, 2014లో టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం (సెర్ప్)గా తిరిగి నామకరణం చేసింది. ఇక ప్రాజెక్టు ప్రారంభమైన 2002 నుంచి ఉద్యోగులంతా కాంట్రాక్టు పద్ధతిలోనే కొనసాగుతుండగా, బీఆర్‌ఎస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2023 ఏప్రిల్‌లో వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తూ అప్పటి సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆ ప్రక్రియలో పే–స్కేల్, ఇతరత్రా వర్తింపజేసినా.. ఇంకా అంశాలను అమలు చేయాల్సి ఉంది. గతేడాది జూలైలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని శాఖల పరిధిలో ఉద్యోగులు, సిబ్బంది బదిలీలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అయితే పదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కొందరు ఉద్యోగులు ఆందోళన చెందారు.

**ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం**



రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టేందుకు ముందుకురావడం మంచి పరిణామం. ఉద్యోగులు, సిబ్బంది పదేళ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. ఇతర జిల్లాలకు చెందిన చాలామంది సిబ్బంది పదేళ్లు, అంతకంటే ఎక్కువగానే ఒకేచోట పనిచేస్తున్నారు. ప్రభుత్వం 100 శాతం ఉద్యోగుల బదిలీలకు అవకాశం ఇవ్వనుండటంతో దాదాపు అందరికీ స్థానచలనం కలుగుతుందని భావిస్తున్నాం.

– డి.నీలయ్య, అదనపు డీఆర్‌డీఓ (సెర్ప్)

### మహిళ అదృశ్యం

దమ్మపేట: ఓ మహిళ కనిపించకుండా పోయిన ఘటన మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన గొర్రెముచ్చు శిరీష (26).. తన భర్త చనిపోవడంతో మండలంలోని మొద్దులగూడెంలోని పుట్టింట్లో ఉంటోంది. గతేడాది నవంబర్ 16న ఇంటి నుంచి సొంత పని మీద బయటకు వెళ్లిన శిరీష ఇప్పటివరకు తిరిగి రాలేదు. తల్లిదండ్రులు పలుచోట్ల వెతకగా ఆచూకీ లభించలేదు. శిరీష తల్లి నిర్మల మంగళవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

### కేటీపీఎస్ ఉద్యోగిపై కానిస్టేబుల్ దాడి

పాల్వంచ: కేటీపీఎస్ సెంట్రల్ ఆఫీస్ మహిళా ఉద్యోగిపై ఓ కానిస్టేబుల్ దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కేటీపీఎస్ సెంట్రల్ ఆఫీస్‌కు ఓ కానిస్టేబుల్ (పెట్రోల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ – పీఆర్‌పీఎఫ్) వెళ్లి అక్కడ విధుల్లో ఉన్న ఓ మహిళా ఉద్యోగి(జూనియర్ అసిస్టెంట్)ని బయటకు రమ్మని పిలిచాడు. వీరిద్దరు కలిసి పక్కనే ఉన్న బాస్కెట్ బాల్ గ్రౌండ్ వద్ద కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో సదరు కానిస్టేబుల్ మహిళా ఉద్యోగి ముఖంపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయమైంది. వెంటనే అదే కానిస్టేబుల్ ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించగా 17 కుట్లు వేసినట్లు సమాచారం. గొడవపై సెంట్రల్ ఆఫీస్‌కు చెందిన పలువురు అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ చేసినట్లు సమాచారం. మరో జూనియర్ అసిస్టెంట్‌పై దాడికి పాల్పడే అవకాశం ఉందనే భయంతో అతడి భార్య చేరుకుని సాయంత్రం వరకు అక్కడే ఉన్నట్లు సమాచారం. దాడి ఘటనపై కేటీపీఎస్ ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా గొడవ జరిగినట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందిని అక్కడికి పంపించామని, తర్వాత ఎలాంటి లిఖిత పూర్వక ఫిర్యాదు ఇవ్వలేదని పేర్కొన్నారు. సీఈ కె.శ్రీనివాసబాబును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

### మొండికుంటలో చోరీ

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామంలో బాణాల భద్రమ్మ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రధాన ద్వారం తాళం పగులగొట్టిన దుండగులు ఇంట్లోకి చేరి బీరువా తాళం పగులగొట్టి నాలుగు తులాల చంద్రహారం, రూ.20 వేల నగదు చోరీ చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ తిరుపతిరావు ఇంటిని పరిశీలించారు.

# ఆద్యంతం ఉత్కంఠే..

**ఉద్రిక్తత నడుమ పెద్దమ్మగుడి పాలకవర్గ ప్రమాణస్వీకారం**
- కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరు
- పోలీస్ పహారా నడుమ కార్యక్రమం



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు





అందోళనకు దిగిన మహిళలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు (ఇన్ సెట్) కిరోసిన్ పోసుకుంటున్న యువకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఆద్యంతం ఉత్కంఠ నడుమే కొనసాగింది. ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తీవ్ర ఉద్రిక్తత, పోలీస్ బందోబస్తు మధ్య పూర్తయింది. అమ్మవారి సాక్షిగా ఇద్దరు యువకులు కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా, ఓ మహిళ గాజులు పగులగొట్టుకోవడంతో పాటు మెడ కోసుకుంటానని ఆందోళనకు దిగింది.

**అసలేం జరిగింది..**

పెద్దమ్మతల్లి ఆలయ పాలకమండలి సభ్యులుగా 14 మంది పేర్లతో కూడిన జాబితా గతనెల 6వ తేదీన విడుదల కాగా, దీనిపై వివాదం తలెత్తింది. దేవాదాయ శాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆ జీఓను రద్దు చేసి 19వ తేదీన 13 మంది సభ్యులతో మరో జాబితా వెల్లడించారు. ఈ కమిటీని ప్రమాణస్వీకారానికి ఈఓ రజినీకుమారి ఆహ్వానించగా.. స్థానికులకు అవకాశం కల్పించాలంటూ కేశవాపురం గ్రామస్తులు ఆందోళన చేయడంతో వాయిదా పడింది. రెండో జీఓ వెలువడి నెల రోజులు దాటడంతో తిరిగి మంగళవారం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేయగా.. మళ్లీ ఘర్షణ జరుగుతుందనే ఉద్దేశంతో డీఎస్పీ సతీశ్‌కుమార్, సీఐ సతీశ్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, స్థానికులు భారీగా చేరుకుని ప్రమాణ స్వీకారం నిలిపేయాలంటూ ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన బండి ఉదయ్, అజ్మీర రమేశ్.. ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా పోలీసులు వారించి అదుపులోకి తీసుకున్నారు. గంధం నర్సింహారావును ముందుగానే అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న వారిని సైతం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆందోళన సద్దుమణగడంతో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని కొనసాగించారు.

**స్థానికులకు చోటేది..?**

అమ్మవారి ఆలయం కొలువై ఉన్న కేశవాపురం గ్రామస్తులకు కమిటీలో స్థానం కల్పించకుండా ఇతర ప్రాంతాల వారికి, అన్యమతస్తులకు అవకాశం ఇవ్వడం ఏం న్యాయమంటూ స్థానికులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ గ్రామస్తులకు అవకాశం కల్పించాలని కోరడం తప్పా అంటూ ప్రశ్నించారు.

**చైర్మన్‌గా నాగేశ్వరరావు..**

పెద్దమ్మతల్లి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా సోములగూడెం గ్రామానికి చెందిన బాలినేని నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. సభ్యులుగా భూక్యా గిరిప్రసాద్, కోరం స్వర్ణలత, పెండ్లి రామయ్య, చందుపట్ల రమ్య, ధర్మరాజుల నాగేశ్వరావు, చీకటి కార్తీక్, చెవుగాని పాపారావు, చెరుకూరి శేఖర్ బాబు, దుగ్గిరాల సుధాకర్, శనిగారపు శ్రీనివాసరావు, అడుసుమల్లి సాయిబాబా, ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా అర్చకుడు మూర్తి రవికుమార్‌శర్మతో దేవాదాయ శాఖ డివిజన్ పరిశీలకులు ఈ.వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా, నాగేశ్వరరావు ఏడో చైర్మన్‌గా నియమితులయ్యారు.

# హాస్టళ్లు, పాఠశాలలు సిద్ధంగా ఉండాలి

- నెలరోజుల్లో మరమ్మతులు పూర్తిచేయాలి
- ఐటీడీఏ పీఓ బి.రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: వేసవి సెలవులు పూర్తయి పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టళ్లు, పాఠశాలల్లోని మేజర్, మైనర్ మరమ్మతులను పూర్తి చేసి, సిద్ధంగా ఉంచాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో స్పెషలాఫీసర్లు, ఇంజనీరింగ్ అధికారులు, హెచ్ఎం, వార్డెన్లతో పీఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లోని డార్మెటరీ, డైనింగ్ హాల్, అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, బాత్రూంలు ఇతర మౌలిక వసతులన్నింటినీ నెలరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రతి పాఠశాలను, హాస్టల్‌ను సందర్శించి ప్రతిపాదనలు తయారు చేసి త్వరగా అందచేయాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టాలని, సెలవుల్లో సైతం పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఉద్దీపనం వర్క్‌బుక్‌లు విద్యార్థులకు ఉపయోగపడేలా చేసిన వారికి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది ఒకటి, రెండో తరగతి విద్యార్థులకు సైతం వీటిని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అందుకోసం నిష్ణాతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి 15 రోజుల్లో ప్రతిపాదనలు తనకు సమర్పించాలన్నారు. సమావేశంలో డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓలు అశోక్‌కుమార్, చంద్రమోహన్, రాధమ్మ, డీఈ మధూకర్, ఏఈ రవి, జీసీడీఓ అలివేలుమంగతాయారు పాల్గొన్నారు. కాగా, ఇంజనీరింగ్‌లో సీటు సాధించిన విద్యార్థినికి ఐటీడీఏ తరఫున ల్యాప్‌టాప్‌ను పీఓ రాహుల్ మంగళవారం అందజేశారు. అశ్వాపురం మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన వాసం గాయత్రి భద్రాచలంలోని టీటీడబ్ల్యూఆర్‌ఎస్‌లో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివి, గేట్ రాసి 8,300 ర్యాంకు సాధించింది. ఆమెకు ల్యాప్‌టాప్‌ను పీఓ అందజేశారు. కార్యక్రమంలో డేవిడ్ రాజ్, విద్యార్థిని తల్లి లలిత తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనుల బహిష్కరణ

అశ్వారావుపేటరూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు సిబ్బంది పనితీరుకు నిరసనగా మంగళవారం బహిష్కరించారు. కూలీల కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామంలోని వైకుంఠ ధామం నుంచి రైతుల పొలాలకు వెళ్లేందుకు 2 కిలోమీటర్ల దూరం మట్టి రోడ్డు నిర్మాణానికి ఈజీఎస్ పథకం కింద రూ.9 లక్షలు మంజూరయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణ పనులను మూడు రోజులుగా ఇదే పంచాయతీకి చెందిన సుమారు 250 మంది కూలీలు చేస్తున్నారు. మూడు రోజుల తర్వాత పని ప్రదేశానికి వచ్చిన టెక్నికల్ అసిస్టెంట్ మహేశ్ కూలీలు చేస్తున్న పనులపై అభ్యంతరం వ్యక్తం చేసి వారిపై దురుసుగా ప్రవర్తించడంతో వివాదం తలెత్తింది. దాదాపు మట్టి రోడ్డు పనులు పూర్తి కావొస్తున్న సమయంలో టీఏ నిబంధనల పేరుతో దురుసుగా వ్యవహరించడంతో ఆగ్రహించిన కూలీలు ఉపాధి పనులను బహిష్కరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై స్థానిక ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావును 'సాక్షి'వివరణ కోరగా.. విషయం తన దృష్టికి వచ్చిందని, కొలతల ప్రకారం మట్టి రోడ్డు నిర్మించాల్సిందేనని పేర్కొన్నారు. ఇష్టారాజ్యంగా చేస్తే ఉపేక్షించేదిలేదని, ఈ ఘటనపై విచారణ చేస్తానని తెలిపారు.

### ఇంటర్ విద్యార్థి అదృశ్యం

సుజాతనగర్: ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం పీకే బంజర గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి సుజాతనగర్‌కు వచ్చి కనిపించకుండా పోయిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పీకే బంజరకు చెందిన గుర్రం అశోక్, ఉమ దంపతుల కుమారుడు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదివాడు. వారం కిందట సుజాతనగర్‌లోని తన పెదనాన్న కుమార్తె వివాహానికి వచ్చి ఇక్కడే ఉన్నాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో గణితం సబ్జెక్ట్‌లో ఫెయిలైన విషయం తెలుసుకుని కనిపించకుండా పోయాడు. అతడి ఆచూకీ కోసం రాత్రి వరకు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమాదేవి తెలిపారు.